క్లుప్తంగా

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ సెక్టారు పీఓ ఎస్తేరురాణి, సిబ్బంది

పూసపాటిరేగ: రుతుక్రమం సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించినట్లయితే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని భోగాపురం ఐసీడీఎస్ సెక్టార్ పీఓ ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని కొప్పెర్ల అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలు, మహిళలకు రుతుక్రమం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన తరగతులు



విద్యార్థులకు బోధిస్తున్న టీచర్, లైబ్రేరియన్ మహేష్

డెంకాడ: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మండలంలోని డెంకాడ శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు భూగోళశాస్త్రంపై అవగాహన కల్పించారు. ఖండాలు, సముద్రాలు, వాటి ప్రత్యేకతలను వివరించారు. అనంతరం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. క్యారమ్స్, చెస్, వంటి ఇండోర్ గేమ్స్ ఆడించారు. లైబ్రేరియన్ వై.మహేస్ విద్యార్థులకు అల్పాహారం అందించారు.

చెంచుకాలనీలో కార్డన్ సెర్చ్



కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘాకు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో డీఎస్పీ ఆర్.గోవిందరావు పర్యవేక్షణలో అయ్యన్నపేట శివారు ప్రాంతంలో ఉన్న చెంచుకాలనీలో సోమవారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీ వీధుల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించి, వారు ఎవరింటికి, ఏ పనిమీద వచ్చిందన్న విషయాలపై ఆరా తీశారు. అలాగే సరైన వాహన రికార్డులు లేని 8 మోటారు సైకిళ్లను, ఒక ఆటోను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. సరైన వాహన పత్రాలు చూపించి వాహనాలు తీసుకువెళ్లాలని సంబంధిత వ్యక్తులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు నరేష్, హరిబాబునాయుడు, నవీన్ పడాల్, జె.తారకేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి



న్యాయవాదులు,పోలీసులతో సమావేశమైన జడ్జి కనకలక్ష్మి

గజపతినగరం: స్థానిక సివిల్ కోర్టులో జూన్ 29న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి కోరారు. స్థానిక కోర్టులో పోలీసులు, న్యాయవాదులతో సోమవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా సివిల్, క్రిమినల్, తదితర కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునే అవకాశం ఉందని, ఈ విషయాన్ని కక్షిదారులకు తెలియజేయాలని సూచించారు. రాజీయే రాజమార్గమని, ఇరువర్గాలను రాజీకుదుర్చి ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



తహసీల్దార్ పద్మావతి

మెరకముడిదాం: జూన్ 5వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మెరకముడిదాం తహసీల్దార్ వై.వి. పద్మావతి తెలిపారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయని, జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా ప్రశాంత వాతావరణంలో ముగిసేలా ప్రజలంతా సహకరించాలని కోరారు. 5వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్న విషయాన్ని అంతా గమనించాలన్నారు. అంతవరకూ పార్టీల వర్గాలు, నాయకులు, కార్యకర్తలు గొడవలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పీహెచ్‌సీల్లో పెరిగిన సేవలు



పూసపాటిరేగ పీహెచ్‌సీ

- అందుబాటులో అధునాతన వైద్య పరికరాలు
- 64 రకాల వైద్య పరీక్షలు, 175 రకాల మందులు
- కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలు
- 24 గంటలు అందుబాటులో వైద్యులు



పూసపాటిరేగ పీహెచ్‌సీలో సేవలందిస్తున్న ల్యాబ్ టెక్నిషియన్



వైద్యం చేస్తున్న డాక్టర్ రాజేష్‌వర్మ



గర్భిణికి వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

పూసపాటిరేగ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా రోగులకు మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా వైద్య ఆరోగ్యశాఖ అధునాతన యంత్రపరికరాలను అందజేసింది. ఒక్కో పీహెచ్‌సీకి సీబీసీ, ఎలక్ట్రోలైట్, ఎనలైజర్, బయోకెమిస్ట్రీ ఎనలైజర్, యూరిన్ ఎనలైజర్, టీబీఆర్టీ పీఆర్ యంత్రాలను సమకూర్చింది. ఇప్పటి వరకు పీహెచ్‌సీల్లో 10 నుంచి 15 రకాలు వైద్య పరీక్షలు మాత్రమే అందుబాటులో ఉండగా.. ప్రస్తుతం అందించిన పరికరాలతో 64 రకాల వైద్య పరీక్షలు చేసేందుకు వీలు కలిగింది. మరోవైపు పీహెచ్‌సీల్లో 175 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

గంటల వ్యవధిలోనే వ్యాధి నిర్ధారణ

గతంలో పీహెచ్‌సీల్లో అంతంత మాత్రమే వైద్యసేవలు అందేవి. చాలా రకాల వైద్య పరీక్షలు అందుబాటులో లేకపోవడంతో వాటి కోసం రోగులు కమ్యూనిటీ ఆస్పత్రులు, జిల్లా కేంద్రాస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. దీంతో రోగులు ఎన్నో వ్యయప్రయాసలు పడేవారు. జిల్లా కేంద్రాస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకున్నా.. రిపోర్టులు వచ్చేందుకు ఎక్కువ సమయం పట్టడంతో ఇబ్బందులు పడేవారు. కొందరు దగ్గరలోని ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించేవారు. ప్రస్తుతం అన్ని రకాల వైద్య పరీక్షలు పీహెచ్‌సీల్లోనే అందుబాటులోకి రావడంతో రోగులకు వ్యయప్రయాసలు తప్పాయి. పీహెచ్‌సీలకు అధునాతన వైద్య పరికరాలు కేటాయించడంతో పాటు వైద్య పరీక్షల కోసం ప్రతీ పీహెచ్‌సీకి ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను ప్రభుత్వం నియమించింది. గంటల వ్యవధిలోనే వ్యాధి నిర్ధారణ కావడంతో సకాలంలో మెరుగైన వైద్య సేవలు పొందేందుకు అవకాశం ఉంది.

ఈ పరీక్షలన్నీ పీహెచ్‌సీల్లోనే..

సీఆర్‌పీ, హిమోగ్లోబిన్, ప్లేట్‌లెట్‌కౌంట్, సీబీసీ, బ్లడ్ సెల్‌కౌంట్, ర్యాండమ్ బ్లడ్ సుగర్, బ్లడ్ యూరియా, సీరం సోడియం, హెచ్‌ఐవీ, హెపటైటిస్ బి, డెంగీ, బ్లీడింగ్, క్లాటింగ్ టైమ్, థైరాయిడ్, పొటాషియం, క్లోరైడ్ తదితర 64 పరీక్షలు పీహెచ్‌సీల్లో అందుబాటులోకి వచ్చాయి. నెల్లిమర్ల నియోజకవర్గం పరిధిలో పూసపాటిరేగ, గోవిందపురం, రెల్లివలస, పోలిపల్లి, సతివాడ, డెంకాడ, మోపాడ, కొండవెలగాడ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆయా సేవలు అందుతున్నాయి.

నిమిషాల వ్యవధిలో రోగ నిర్ధారణ

పీహెచ్‌సీకి వచ్చిన రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నాం. నిమిషాల వ్యవధిలోనే రోగనిర్ధారణ చేసి మెరుగైన వైద్యం అందిస్తున్నాం. ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోకుండా రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– రాజేష్‌వర్మ, వైద్యాధికారి, పూసపాటిరేగ పీహెచ్‌సీ

స్ఫూర్తిప్రదాత రమాబాయి



రమాబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

విజయనగరం: స్త్రీల హక్కుల కోసం పోరాడిన మాత రమాబాయి నేటి మహిళలకు స్ఫూర్తిప్రదాత అని విజయనగరం జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బొంగ భానుమూర్తి అన్నారు. నగరంలోని రాక్‌పార్క్ ప్రాంతంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద మాతా రమాబాయి అంబేడ్కర్ 89వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భానుమూర్తి మాట్లాడుతూ.. రమాబాయి ఆలోచన స్ఫూర్తితో బీఆర్ అంబేడ్కర్ స్త్రీల హక్కుల కోసం పాటుపడ్డారని అన్నారు. రమాబాయి తన ముగ్గురు పిల్లలను కోల్పోయినప్పటికీ అంబేడ్కర్ విదేశీ విద్యకు సహకరించారని గుర్తుచేశారు. ఆమె గొప్పవ్యక్తిత్వాన్ని నేటి తరం వారంతా స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం పార్లమెంటు జై భీమ్‌రావు భారత్ పార్టీ అభ్యర్థి అరుణ్ కుమార్, స్వాతి, మధుసూదనరావు, మల్లన సంతోష్, మనీ, అలమండ సూరిబాబు, పట్టా గవరరాజు, వేమల వంశీ, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

నెల్లిమర్ల: పట్టణంలోని వేణుగోపాలపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉషారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతికి ఈనెల 29, ఇంటర్ సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు 31న కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు. అర్హత కలిగిన విద్యార్థులు తమ ఆధార్, కుల, ఆదాయ, బదిలీ సర్టిఫికెట్లతో నేరుగా కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

ఏఐసీటీయూ నాయకుల నివాళి

విజయనగరం పూల్‌బాగ్: కాకినాడ జిల్లా జగ్గంపేట వద్ద ఆదివారం జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందిన దొంతల శ్రీనివాసరావు(35)కి ఏఐసీటీయూ నాయకులు నివాళులర్పించారు. పట్టణంలోని గణేష్‌నగర్ ప్రాంతానికి చెందిన శ్రీనివాసరావుకు భార్యతో పాటు పాప, బాబు ఉన్నారు. అరుణ జ్యూట్‌మిల్లులో కార్మికుడిగా పనిచేసిన శ్రీనివాసరావు కార్మికుల సమస్యలపై పోరాటం చేశారు. ఆయన అకాల మరణం కార్మిక వర్గానికి తీరని లోటని పేర్కొన్నారు. నివాళులర్పించిన వారిలో ఏఐటీయూసీ ప్రెసిడెంట్ జేవీ కైలాస్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ దల్లి అప్పలరెడ్డి, ఎం.తౌడు, సిహెచ్.ఈశ్వరరావు, పి.శ్రీను, చౌదరి, పి.నారాయణరావు, ఎం.దుర్గారావు, ఆదిరెడ్డి, తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి సాంబమూర్తి



సచివాలయ కార్యదర్శులకు సూచనలిస్తున్న ప్రజారోగ్యాధికారి సాంబమూర్తి

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేదిలేదని ప్రజారోగ్య అధికారి డా.సాంబమూర్తి హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం మొదటి సర్కిల్‌కు చెందిన పారిశుద్ధ్య పర్యవేక్షకులు, పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలతో సమీక్ష నిర్వహించారు. ప్రతి సచివాలయ పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి వేరుచేయాలని సూచించారు. తడి చెత్తను పాలాస్పత్రికి అందించాలన్నారు. కాలువలలో పూడికలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో పారిశుద్ధ్య పర్యవేక్షకుడు బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ కార్మికులకు అండగా సీఐటీయూ



కార్మికులకు మద్దతుగా నినాదాలు చేస్తున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాములమ్మ

కొత్తవలస: అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని జిందాల్ స్టెయిన్‌లెస్‌స్టీల్ కర్మాగార కార్మికులకు న్యాయం జరిగే వరకు సీఐటీయూ, అనుబంధ కార్మిక సంఘాలు అండగా ఉంటాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాములమ్మ తెలిపారు. ఈనెల 17వ తేదీన జిందాల్ కర్మాగారం లే ఆఫ్‌ను ప్రకటించడంతో నుంచి కర్మాగారం ప్రధాన గేటు వద్ద కార్మికులు నిరసన తెలుపుతున్నా రు.కార్మికుల దీక్షా శిబిరాన్ని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాములమ్మ సోమవారం సందర్శించి తన సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ లే ఆఫ్‌ను ఎత్తేయాలని కార్మికులు చేస్తున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.కర్మాగారాల యాజమాన్యాలకు కార్మికులపై చిన్నచూపు తగదన్నారు. అర్ధంతరంగా కంపెనీలు మూసేస్తే కార్మికులు కుటుంబాలు వీధిన పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిందాల్ కర్మాగారం తక్షణమే లే ఆఫ్ ఎత్తేయాలని,కార్మికులకు పూర్తి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 29వ తేదీన లేబర్ కమిషన్ వద్ద కార్మికులకు, యాజమాన్యానికి మధ్య జరగనున్న చర్చల్లో యాజమాన్యం సానుకూలంగా స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మిక సంఘం జేఏసీ నాయకులు గాడి అప్పారావు, నమ్మి చిన్నబాబు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..
ప్రయాణికుల పాలిట శాపం



దేవుని నెలివాడ సమీపంలో కల్వర్టు వద్ద ఎత్తు పల్లాలను సరిచేస్తున్న స్థానికులు

నెల్లిమర్ల రూరల్: కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరి ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. ఫలితంగా ప్రయాణికులు తరుచూ ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలో నెల్లిమర్ల-రణస్థలం ప్రధాన రహదారిలో సుమారు 8 నెలల క్రితం చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పలుచోట్ల కల్వర్టులు ఏర్పాటు చేశారు. దేవుని నెలివాడ సమీపంలో నిర్మించిన కల్వర్టు వద్ద ఎత్తు పల్లాలను సరి చేయకుండా అలానే వదిలేశారు. దీంతో ఆ ప్రదేశం వద్ద వాహన చోదకులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటివరకు సుమారు 15 మంది ప్రమాదాలకు గురికాగా, వారిలో నలుగురు తీవ్ర గాయాలపాలై మంచానికే పరిమితమయ్యారని స్థానికులు చెపుతున్నారు. తాజాగా అదే ప్రాంతంలో వాహనం అదుపుతప్పడంతో పూసపాటిరేగ మండలం కనిమెళ్లకు చెందిన ఓ కుటుంబం తీవ్ర గాయాలపై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మార్గంలో నిర్మించిన ఐదు కల్వర్టుల వద్ద ఇదే పరిస్థితి ఉందని ప్రయాణికులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనం తయారీపై శిక్షణ



మధ్యాహ్న భోజన వంట నిర్వాహకులకు శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ చంద్రకళ

భోగాపురం: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్నం భోజన పథకం నిర్వాహకులకు (కుక్ కమ్ హెల్పర్స్) సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.చంద్రకళ, ఎంఈఓ రమణమూర్తి, ఎంఈఓ-2 చంద్రమౌళి ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం, జాతీయ పోషకాహార సంస్థ సంయుక్తంగా రూపొందించిన పౌష్టికాహార మోనూను మరింత పటిష్టంగా ఎలా అమలు చేయాలి, విద్యార్థులకు రుచికరంగా వంటలు ఏవిధంగా తయారు చేయాలి అనే అంశాలపై తాజ్ హోటల్ యాజమాన్యం సౌజన్యంతో ఆడియో, వీడియో శిక్షణ అందించారు. అనంతరం వంట నిర్వాహకులకు వివిధ రకాల వంటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అడ్మిన్ స్టేట్ ఆఫీసర్ దాసరి బంగారయ్య పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో అందుబాటులో విత్తనాలు



పెదతాడివాడ ఆర్‌బీకేలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

డెంకాడ: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావాల్సిన విత్తనాలను రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని విజయనగరం విత్తనాభివృద్ధి సంస్థ డీఎం ఎస్.పద్మ, ఆర్.అన్నపూర్ణ, విజయనగరం ఏడీఏ నాగభూషణం తెలిపారు. మండలంలోని పెదతాడివాడ, పినతాడివాడ, డెంకాడ గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలను సోమవారం వారు సందర్శించారు. అక్కడ ఉన్న వరి, పచ్చిరొట్ట విత్తనాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లాలో 46,531 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం కాగా 10,524 క్వింటాళ్ల విత్తనాలను ఆర్‌బీకేల్లో పంపిణీకి సిద్ధంగా ఉంచామన్నారు. అలాగే రైతులకు 50 శాతం రాయితీపై జీలుగు(కిలో రూ.44), కట్టిజనుము(కేజీ రూ.44), పిల్లిపెసర(కేజీ రూ.67) పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్నామని, ప్రస్తుతం 1497 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. రైతుల అవసరం మేరకు మరిన్ని విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు: సీఐ



కోనాడ గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

పూసపాటిరేగ: జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు, నిబంధనలు కచ్చితంగా పాటించాలని, నిబంధనలు అతిక్రమించేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని భోగాపురం రూరల్ సీఐ బి.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కోనాడ గ్రామంలో సోమవారం పర్యటించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ఫలితాలు వెల్లడైన తరువాత ఎటువంటి ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించినా, బాణసంచా కాల్చినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులుగా తిరగొద్దని సూచించారు. ఇప్పటికే గొడవలు, కేసుల్లో ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టామని, అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించేవారిపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎస్సై ఎ.సన్యాసి నాయుడు ఉన్నారు.



నీడపట్టున వేతనదారులు..

ఎండలు మండుతుండడంతో కనీసం ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి. కాని ఉపాధి వేతనదారులు మండుటెండలోనూ పనులు చేస్తున్నారు. గతంలో వేతనదారులకు కనీస వసతులు కల్పించేవారు కాదు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో టెంట్లు, తాగునీరు, మెడికల్‌కిట్లు అందుబాటులో ఉంచడంతో వేతనదారులకు స్వాంతన చేకూరినట్టైంది. ధర్మపురం – చింతలవలస మధ్యలో గల ఎర్ర చెరువులో పనులు చేస్తున్న వేతనదారులు ఎండ ఎక్కువగా ఉండేసరికి నీడపట్టుకు చేరిన దృశ్యం సాక్షి క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

క్రెడాయ్ నూతన భవనం ప్రారంభం



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న క్రెడాయ్ జాతీయ పూర్వ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి

విజయనగరం అర్బన్: నిర్మాణ రంగంలో వస్తున్న ఆధుకతపై అవగాహన పెంచుకుంటూ మెరుగైన నైపుణ్యత అందించే దిశగా క్రెడాయ్ సహకరిస్తుందని ఆ సంఘం జాతీయ పూర్వ అధ్యక్షుడు సి.శేఖరరెడ్డి అన్నారు. స్థానిక ధర్మపురి వసంత విహార్ లేఅవుట్‌లో నూతనంగా నిర్మించిన క్రెడాయ్ నూతన భవనాన్ని జాతీయ సహాయ కార్యదర్శి బి.రాజాశ్రీనివాస్, రాష్ట్ర చైర్మన్ ఎ.శివారెడ్డి, అధ్యక్షుడు ఎన్.వి.రమణారావు, ప్రధాన కార్యదర్శి పాయల శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రెడాయ్ విజయనగరం చరిత్రలో మంచి రోజుగా భావిస్తున్నామన్నారు. నిర్మాణ రంగంలో వస్తున్న మార్పులపై చర్చించేందుకు ఓ వేదిక అవసరమన్నారు. ఆ దిశగా క్రెడాయ్ నూతన భవనాన్ని నిర్మించిన జిల్లా సభ్యులకు అభినందనలు తెలిపారు. ఉద్యోగ కల్పనలో క్రెడాయ్ దేశంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. వినియోగదారులకు, ప్రజలకు మేలు జరిగేలా క్రెడాయ్ పని చేస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రబోస్, జిల్లా చైర్మన్ వి.పార్థసారధి, జిల్లా మాజీ అధ్యక్షుడు ఫౌండర్ సూర్యనారాయణరాజు, కె.రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కామన్ విద్యా విధానంతో సత్ఫలితాలు



మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం

విజయనగరం అర్బన్: కామన్ విద్యా విధానం ద్వారానే మెరుగైన విద్యను పేదలకు అందించవచ్చని శాసన మండలి మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. యూటీఎఫ్ ఉద్యమ నేత కోరెడ్ల శేషగిరి మాస్టార్ 3వ వర్ధంతి సందర్భంగా స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాయంలో జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా శేషగిరి మాస్టారు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంలో పరిణామాలు సవాళ్లు, కర్తవ్యాలను వివరించారు. శేషగిరి మాస్టారు స్మారకపోన్యాసం చేయడం బాధాకరంగా ఉందన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, శ్రీలక్ష్మి, బీఈడీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ శర్మ, ఏపీటీఎఫ్ (257) శ్రీనివాసరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ పట్నాయక్, పీఆర్‌టీయూ నాయకుడు బంకపల్లి శివప్రసాద్, యూటీఎఫ్ నాయకులు విజయగౌరి, కె.శ్రీనివాసరావు, డి.రాము, ఎం.శ్రీనివాస, శేషగిరి మాస్టార్ తల్లి సూర్యకాంతం, మన్యం జిల్లా, శ్రీకాకుళం జిల్లా నాయకులు, పలువురు ఉపాధ్యాయులు సదస్సుకు హాజరయ్యారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో సత్తా



చీపురుపల్లి: పతకాలు సాధించిన క్రీడాకారులతో శిక్షకుడు రమేష్



కొత్తవలస: పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ నూకరాజు

చీపురుపల్లి: జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈనెల26న నిర్వహించిన 17వ రాష్ట్రస్థాయి ఆహ్వానపు చాంపియన్ షిప్ కరాటే పోటీల్లో స్థానిక ఒకినోవా కరాటే అకాడమీకి చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. జూనియర్స్ విభాగం కుమిటీ(ఫైటింగ్) పోటీల్లో ఎస్.గౌతమ్ రజత పతకం, జి.నీరజ్‌నాయుడు కాంస్య పతకం సాధించారు. కరాటే విభాగంలో పి.రాధాకృష్ణ సిల్వర్ పతకం, జె.దీపక్‌నాయుడు కాంస్య పతకాలు సాధించారు. వివిధ విభాగాల్లో బి.వి.మేఘన శ్యామ్, బి.తుషార్ సాయి, జె.హన్సిక కాంస్య పతకాలు సాధించారు. వీరిని అకాడమీ వ్యవస్థాపకుడు, శిక్షకుడు డి.రమేష్ సోమవారం అభినందించారు.

కొత్తవలస విద్యార్థులకు పతకాలు

కొత్తవలస: జిల్లా కేంద్రంలో ఈనెల 26న నిర్వహించిన రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్ కరాటే పోటీల్లో కొత్తవలస విద్యార్థులు పలు విభాగాల్లో బంగారు పతకాలు సాధించారు. కొత్తవలస పట్టణానికి చెందిన ఒకినోవా స్పోర్ట్స్ అకాడమీకి చెందిన కోచ్ కె.నూకరాజు ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. బాలుర విభాగం కుమిటీ పోటీల్లో విద్యార్థి కె.లక్ష్మీదీపక్ స్వర్ణం, కాటాస్లోలో రజత పతకాలు సాధించారు. బాలికల విభాగం కుమిటీ, కాటాస్లో పోటీల్లో కె.జయశ్రీ స్వర్ణ పతకాలు సాధించింది. మరికొన్ని విభాగాల్లో కె.నాగ వెంకటవంశీ, కె.బాలాజీ, పి.గౌరీప్రసన్న పతకాలు సాధించారు.